بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 07 November 2025 (Telugu)

## తహ్‌రీకె జదీద్ 91వ సంవత్సరంలో జమాఅత్ సభ్యులు సమర్పించిన ఆఇర్థక త్యాగాల ప్రస్తావన
## 92వ సంవత్సర ఆరంభపు ప్రకటన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 07.11.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ
نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం మరియు అల్ బఖరహ్ అధ్యాయపు 262వ సూక్తి పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహు ల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

నవంబర్ ఒకటవ తేదీ నుండి అల్లాహ్ తఆలా దయతో జమాఅత్ తహ్రీక్-ఎ-జదీద్ కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా తహ్రీక్-ఎ-జదీద్ కొత్త సంవత్సరం ప్రకటన కూడా చేయబడుతుంది, గడిచిన సంవత్సరంలో చేసిన ఆర్థిక త్యాగాల గురించి కూడా ప్రస్తావించ బడుతుంది. ఇదే విధంగా ఆర్థిక త్యాగ ప్రాముఖ్యత గురించి కూడా కొంత వివరించబడుతుంది.

తహ్రీక్-ఎ-జదీద్ 1934లో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు చేత ప్రారంభించ బడింది. దానికి కారణం ఏమిటంటే ఆ సమయంలో అహ్రార్ జమాఅత్‌కు వ్యతిరేకంగా ఒక పెద్ద అల్లరిని లేవదీశారు, పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వారి పవిత్ర సమాధి ఉన్న బహిష్తీ మఖ్బరా (ఖబ్రిస్తాన్)ను అపవిత్రం చేసే కార్యక్రమం కూడా ఉండెను. ప్రభుత్వం కూడా వ్యతిరేకులకు మద్దతు ఇస్తున్నట్లుగా కనిపించింది. అటువంటి సమయంలో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు జమాఅత్‌ను ఒక ఫండ్‌ను సమకూర్చమని ప్రోత్సహించారు, తద్వారా అహ్మదియ్యత్, ఇస్లాం సందేశాన్ని ప్రపంచంలోని నలుమూలలకు చేర్చగలం. అలాగే వ్యతిరేకుల కుట్రలు, నిరసనలను మనం అరికట్టడానికి జమాఅత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయగలం. ఒక చోట వ్యతిరేకత ఉన్నప్పటికీ మరొక చోట పురోగతి కనిపించేలా, జమాఅత్ వ్యవస్థ విస్తరిస్తూ పోయేలా చేయవచ్చునని సూచించారు. అల్లాహ్ తఆలా దయతో ఈ రోజు మనం చూస్తున్నాం. ప్రపంచంలోని అన్ని దేశాలలో అహ్మదియ్యత్, నిజమైన ఇస్లాం సందేశం చేరుకుంది. మన మిషనరీలు, మబ్లిగీన్లు అక్కడ పని చేస్తున్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో మనం మసీదులను నిర్మించాం, మన పాఠశాలలు పనిచేస్తున్నాయి, ఆసుపత్రులు పనిచేస్తున్నాయి. సంస్థ మబ్లిగీన్లు, మురబ్బీలు సేవ చేయగలుగుతున్నారు, సాహిత్యం ప్రచురించబడుతోంది. కేంద్ర స్టూడియోతో పాటు ఎమ్.టి.ఏ. స్టూడియోలు అనేక దేశాలలో స్థాపించ బడ్డాయి, రేడియో స్టేషన్లు స్థాపించ బడ్డాయి. ఈ పనులన్నింటికి సంబంధించిన చాలా ఖర్చు

ఇతర చందాల ద్వారా కూడా తీర్చబడుతున్నప్పటికీ తహ్రీక్-ఎ-జదీద్ ఇందులో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది.

మేము ఖాదియాన్ ఇటుకలను పెకిలిస్తాము, అహ్మదియ్యత్‌ను ప్రపంచపటంలో నామరూపాలు లేకుండా చేస్తామని అహ్రార్ ప్రకటనలు చేస్తుండెను. నేటికీ మన వ్యతిరేకులు ఈ నినాదాలను లేవనెత్తుతున్నారు. ఆ నినాదాలకు సమాధానం ప్రతి సంవత్సరం జమాఅత్ పురోగతి ద్వారా ఇవ్వబడుతోంది, అల్లాహ్ తఆలా దయానుగ్రహాల ద్వారా ఇవ్వబడుతోంది. బైఅత్ చేసి జమాఅత్‌లో చేరిన ప్రజలు దీనికి సమాధానం. నేడు 220 దేశాలలో విస్తరించిన జమాఅత్ పురోగతి దీనికి సమాధానం.

అందువలన, అల్లాహ్ తఆలా ఈ చర్య, మద్దతు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వారి ప్రకటన నిజమనదై ఉండెనని నేడు కూడ నిజమేనని రుజువు చేస్తుంది. అహ్మదియ్యత్ అల్లాహ్ తఆలా దయతో ఏ మానవుడు స్థాపించిన మొక్క కాదు, ఏ సంస్థ స్థాపించిన మొక్క కాదు, ఏ ప్రభుత్వం స్థాపించిన మొక్క కాదు, వాస్తవానికి ఇది అల్లాహ్ తఆలాచే స్థాపించబడిన మొక్క, శాఖలు ప్రపంచమంతటా విస్తరించిన ఒక పెద్ద వృక్షంగా ఇది మారింది, అల్లాహ్ తఆలా దానిని మరింత విస్తరిస్తూ, ఫలాలను ప్రసాదిస్తూ పోతున్నాడు. ఈ సంస్థ కొనసాగుతూ, పెరుగుతూ ఉంది.

హుజూరె అన్వర్ తాము పఠించిన అల్ బఖరహ్ అధ్యాయపు 262వ సూక్తి వెలుగులో వివరిస్తూ, నా మార్గంలో మీరు ఖర్చు చేసే వాటికి మీకు ప్రతిఫలం ఇవ్వకుండా నేను విడిచిపెట్టను అని అల్లాహ్ తఆలా వాగ్దానం చేశాడని అన్నారు. అంతేకాక మీరు చేసిన ఈ త్యాగాన్ని ఏడు వందల రెట్లు లేదా అంతకంటే ఎక్కువగా పెంచే శక్తి నాకు ఉందని కూడా తెలిపాడు. కాబట్టి ఈ ఆదేశాన్ని ఇవ్వడం ద్వారా అల్లాహ్ తఆలా విశ్వాసుల హృదయాలలో తమ హృదయాలను తెరిచి అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తూ ఉండాలని ఒక ప్రేరణను కలిగించాడు. ఈ యుగంలో మసీహ్ మౌఊద్, మెహదీ మౌఊద్ గారికి అప్పగించబడిన, ఆ తరువాత వారి జమాఅత్‌నకు అప్పగించబడిన అల్లాహ్ ధర్మాన్ని వ్యాప్తి చేయడానికి ఖర్చు చేయండి. త్యాగం చేసేవారు తమ అనుభవాలను కూడా నాకు రాస్తుంటారు. వారికి అల్లాహ్ తఆలా ఎలా త్యాగం చేసే అవకాశాన్ని ప్రసాదించాడు, వారి విశ్వాసాలను ఎలా బలోపేతం చేశాడు అని చూసి ఆశ్చర్యం కలుగుతుంది.

హుజూరె అన్వర్ అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి కొన్ని జ్ఞానపరమైన, చారిత్రక ఆధారాలను ఉదహరించారు. ఆర్థిక త్యాగాలు చేసిన వ్యక్తులకు ఇది ఒక మార్గదర్శకమని అన్నారు. వారు తమ ఆరాధనల ప్రమాణాలను కూడా పెంచుకోవాలి. ఆర్థిక త్యాగం చేసిన తరువాత మేము ఆరాధనల నుండి విముక్తి పొందాము అని భావించకూడదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి కాలంలోని అనుచరుల ఉదాహరణలు కూడా ఉన్నాయి, ఇదేవిధంగా మన జమాఅత్‌లోని ఆరంభ సత్యమూర్తులు కూడా తమ ధనాన్ని అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడానికి లెక్కించేవారు కాదు, వారెంతో ఉదారంగా ఖర్చు చేసేవారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అల్ అవ్వల్

రజియల్లాహు అన్హు కూడా చాలా త్యాగాలు చేసేవారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారే స్వయంగా ఒక చోట ఇలా పేర్కొన్నారు: నేను అనుమతించి ఉంటే, వారు అంటే మౌలానా నూరుద్దీన్, ఖలీఫతుల్ మసీహ్ అల్ అవ్వల్ తమ ఆధ్యాత్మిక సహచర్యం వలె, ఈ మార్గంలో ప్రతిదీ త్యాగం చేసి, నా భౌతిక సహచర్యాన్ని ఎల్లప్పుడూ నా సాంగత్యంలో ఉండే హక్కును కూడా నెరవేర్చేవారు.

హుజూరె అన్వర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిబద్ధత గల సభ్యులు తహ్రీక్-ఎ-జదీద్ ఆర్థిక త్యాగంలో చేసిన త్యాగాల నేపథ్యంలో అల్బేనియా, ఇండోనేషియా, ఘానా, గనీ కనాకరీ, మాలి మొదలైన దేశాలలోని వినమ్రులైన సభ్యుల త్యాగాలకు సంబంధించిన విశ్వాసాన్ని పెంచే వివిధ సంఘటనలను, అలాగే వారిపై కురిసిన బహుమతులు, దైవానుగ్రహాలను ప్రస్తావించారు.

హుజూరె అన్వర్ గారిలా ఉపదేశించారు: భారతదేశ తహ్రీక్-ఎ-జదీద్ ఇన్స్పెక్టర్ తెలంగాణకు చెందిన ఒక వ్యక్తి గురించి అతను హైదరాబాద్‌లోని ఒక ప్రాంత నివాసి అని రాశారు. అతని వాగ్దానం ఏడు వేల రూపాయలు ఉండెను. అయితే ఉద్యోగం కోల్పోవడం వల్ల అతను చెల్లించలేకపోయాడు. వచ్చే సంవత్సరం కోసం అతను పది వేల రూపాయల వాగ్దానం వ్రాయించాడు. మీరు గత సంవత్సరం వాగ్దానమే పూర్తి చేయలేదు, ఇప్పుడు రాబోయే సంవత్సరానికి పెంచి వాగ్దానం వ్రాయిస్తున్నారు అని అతనికి చెప్పబడింది. అందుకు ఆ వ్యక్తి ఇలా సమాధానం ఇచ్చాడు. అల్లాహ్ తఆలా దానంతట అదే దానిని ఏర్పాటు చేస్తాడు అని నాకు నమ్మకం ఉంది, ఎందుకంటే నేను దానిని అల్లాహ్ కోసం ఇస్తున్నాను. కొద్ది రోజుల్లోనే అతనికి అంతకుముందు కంటే మెరుగైన ఉద్యోగం లభించింది. అతను గత రెండు సంవత్సరాల చందాను కూడా చెల్లించాడు. కొత్త ఆర్థిక సంవత్సరంలో తన వాగ్దానాన్ని ఏడు వేలకు బదులుగా ఇప్పుడు ముప్పై వేలకు పెంచాడు. దానిని కూడా చెల్లించాడు. ఈ విధంగా అల్లాహ్ తఆలా అతని సదుద్దేశం, కోరికకు ప్రతిఫలం ఇచ్చాడు.

ఆ తరువాత హుజూరె అన్వర్ తహ్రీక్-ఎ-జదీద్ 92వ కొత్త సంవత్సర ప్రారంభాన్ని ప్రకటించారు. తహ్రీక్-ఎ-జదీద్ 91వ సంవత్సరపు గణాంకాలను వివరిస్తూ, హుజూర్ ఇలా తెలిపారు: అల్లాహ్ తఆలా దయతో జమాఅత్‌కు 19.55 మిలియన్ పౌండ్ల త్యాగాన్ని సమర్పించే అవకాశం లభించింది. అల్-హమ్దులిల్లాహ్. ఇది గత సంవత్సరం కంటే 5 లక్షల 64 వేల పౌండ్ల కంటే ఎక్కువ. ఇది ఈ సంవత్సరం పెరిగిన చందా.

మొత్తం వసూళ్ల పరంగా మొదటి పది జమాఅత్‌లు: జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, కెనడా, భారతదేశం, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, మిడిల్ ఈస్ట్ జమాఅత్‌లు, ఘానా.

గణనీయమైన పెరుగుదలను చూపిన జమాఅత్‌లు: మారిషస్, హాలండ్.

మొత్తం పనితీరు పరంగా గుర్తించదగిన ఇతర జమాఅత్‌లు: బెల్జియం, స్వీడన్, ఫ్రాన్స్, హాలండ్, కబాబీర్, బంగ్లాదేశ్, బుర్కినా ఫాసో, న్యూజిలాండ్, సీరా లియోన్, బెనిన్, మాలి, నైజర్, టర్కీ, జార్జియా, మిడిల్ ఈస్ట్ జమాఅత్‌లు, ఆస్ట్రేలియా.

ఆఫ్రికాలో మొత్తం వసూళ్ల పరంగా మొదటి ఐదు జమాఅత్‌లు: ఘానా, మారిషస్, నైజీరియా, బుర్కినా ఫాసో, తంజానియా.

తహ్రీక్-ఎ-జదీద్‌లో పాల్గొనేవారి మొత్తం సంఖ్య 17 లక్షల వరకు ఉంది. ఈ సంవత్సరం నివేదికల ప్రకారం దఫ్తర్ షషుమ్ (ఆరవ కార్యాలయం) లో చేరిన వారి సంఖ్య 43,588.

భారతదేశంలోని మొదటి పది రాష్ట్రాలు: కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, పంజాబ్, బెంగాల్, మహారాష్ట్ర మరియు ఢిల్లీ.

భారతదేశంలోని మొదటి పది జమాఅత్‌లు: హైదరాబాద్, కోయంబత్తూర్, ఖాదియాన్, కాలికట్, మేలపాలెం, మంజేరి, బెంగళూరు, కేరంగ్, కలకత్తా మరియు కరుళాయి.

ఆ తరువాత హుజూరె అన్వర్ గారిలా అన్నారు: ఇది తహ్రీక్-ఎ-జదీద్ దఫ్తర్ అవ్వల్ (మొదటి కార్యాలయపు) 92వ సంవత్సరం అవుతుంది. దాని పాత ఖాతాలు కొనసాగుతున్నాయి. దఫ్తర్ దువ్వమ్ (రెండవ కార్యాలయపు) 82వ సంవత్సరం, దఫ్తర్ సువ్వమ్ (మూడవ కార్యాలయపు) 61వ సంవత్సరం, దఫ్తర్ చహారుమ్ (నాల్గవ కార్యాలయపు) 41వ సంవత్సరం, దఫ్తర్ పంజుమ్ (ఐదవ కార్యాలయపు) 22వ సంవత్సరం మరియు దఫ్తర్ షషుమ్ (ఆరవ కార్యాలయపు) 3వ సంవత్సరం ఇప్పుడు ప్రారంభమవుతుంది. కొత్తగా వచ్చే వారు దఫ్తర్ షషుమ్‌లో లెక్కించబడతారు.

ఆ తరువాత హుజూరె అన్వర్ ఆర్థిక త్యాగానికి సంబంధించిన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి ఒక పంక్తిని ఉటంకిస్తూ ఈ విధంగా దుఆ చేశారు. అల్లాహ్ తఆలా ఈ ఆర్థిక త్యాగాల కారణంగా మనకు ఇస్లాం సందేశాన్ని అందించే అవకాశాన్ని కల్పిస్తున్నాడు. అల్లాహ్ తఆలా మన ప్రయత్నాలలో అనంతమైన శుభాన్ని ప్రసాదించి, వాటి ఉత్తమ ఫలితాలను అనుగ్రహించు గాక! మనం త్వరలోనే ప్రపంచంలో ఏకైక దేవుని పాలన స్థాపించబడటాన్ని దర్శింతుము గాక! మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జెండా ఎగురవేయబడటాన్ని తిలకింతుము గాక!.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔